అవయలో 300 ఉద్యోగాలు

న్యూఢిల్లీ, నవంబర్ 13: కమ్యూనికేషన్స్ కంపెనీ అవయ..వచ్చే ఏడాది ఉద్యోగుల సంఖ్యను 20 శాతం మేర పెంచుకోబోతున్నది. ప్రస్తుతం సంస్థలో 1,200 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఈ సంఖ్యను 1,500కి పెంచుకోనున్నట్లు కంపెనీ సీఈవో అలన్ మసారేక్ తెలిపారు. కొత్తగా తీసుకునేవారిలో డాటా సైంటిస్టులు, కృత్రిమ మేధస్సు విభాగాలకు చెందిన వారిని చెప్పారు. ప్రస్తుతం సంస్థకు ఎయిర్‌టెల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ), కేంద్ర ప్రభుత్వంలు కీలక క్లయింట్లుగా కొనసాగుతున్నారు. బెంగళూరు, పుణె, హైదరాబాద్, గురుగ్రామ్‌లలో ఉన్న ఆర్ అండ్ డీని మరింత బలోపేతం చేయడానికి ఈ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు.

65 వేల దిగువకు సెన్సెక్స్

325 పాయింట్లు నష్టపోయిన సూచీ

ముంబై, నవంబర్ 13: మూరత్ ట్రేడింగ్‌లో మురిపించిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఆ మరుసటి రోజే భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్, ఆర్థిక రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. ముఖ్యంగా ద్రవ్యోల్బణ గణాంకాలు పెరుగుతాయన్న అంచనాలు మదుపరుల్లో అమ్మకాలవైపు నడిపించాయి. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం, బలహీనమైన రూపాయి పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ 65 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 325.58 పాయింట్లు కోల్పోయి 64,933.87 పాయింట్ల వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 82 పాయింట్లు కోల్పోయి 19,443.55 వద్ద నిలిచింది. అంతర్జాతీయ దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈక్విటీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని, పారిశ్రామిక వృద్ధిరేటు తగ్గుముఖం పట్టడం మదుపరుల్లో ఆందోళన పెరిగిందని జియోజిత్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, నెస్లె, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, అల్ట్రాటెక్ సిమెంట్‌లు నష్టపోయాయి.
- వీటితోపాటు యాక్సిస్ బ్యాంక్, మారుతి, హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, కొటక్ బ్యాంక్, విప్రో, ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్‌లు కూడా మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.
- మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్, హెచ్‌సీఎల్‌టెక్, ఎస్బీఐలు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్, టెక్, ఎఫ్ఎంసీజీ, సర్వీసులు, ఆర్థిక సేవల రంగ షేర్లు నష్టపోగా..ఎనర్జీ, యుటిలిటీ, పవర్, ఆటో రంగ సూచీలు లాభపడ్డాయి.
- దీపావళి సందర్భంగా నిర్వహించిన మూరత్ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 354.77 పాయింట్లు, నిఫ్టీ 100 పాయింట్లు చొప్పున పెరిగింది.
- దివాళీ బలిప్రతిపద సందర్భంగా మంగళవారం స్టాక్ మార్కెట్లు, ఫారెక్స్ మార్కెట్లకు సెలవు.

మూరత్ ట్రేడింగ్ సందర్భంగా ఒపెనింగ్ బెల్‌ను కొట్టి ప్రారంభిస్తున్న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ చైర్మన్ ఎస్ ముంద్రా. చిత్రంలో బీఎస్ఈ ఎండీ,సీఈవో సుందరామన్ రామమూర్తి, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ ఎండీ, సీఈవో దినానాథ్ దుభాషి

రికార్డు కనిష్ఠానికి రూపాయి

83.33 వద్ద ముగిసిన కరెన్సీ

ముంబై, నవంబర్ 13: కొద్ది వారాలుగా ఆల్‌టైమ్ కనిష్ఠస్థాయి సమీపంలో అటూ ఇటూ కదులుతున్న రూపాయి సోమవారం రికార్డు కనిష్ఠస్థాయి 83.33 వద్దకు ముగిసింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్) ఇంట్రాడే ట్రేడింగ్‌లో 83.39 వద్దకు పతనమైన రూపాయి చివరకు క్రితం ట్రేడింగ్ రోజుతో పోలిస్తే 5 పైసలు నష్టపోయి 83.33 వద్ద ముగిసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 18న ముగింపు 83.32 ఇప్పటివరకూ రికార్డు కనిష్ఠ ముగింపు.

ఆర్బీఐ మద్దతు వ్యర్థం

దేశీయ నిరుత్సాహకర ఆర్థికాంశాలకు తోడు అంతర్జాతీయ మార్కెట్లో అమెరికా డాలర్ బలపడటం, భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు అదేపనిగా నిధులు తరలించుకుపోవడం, మధ్యప్రాచ్య యుద్ధ ఉద్రిక్తతలు తదితర ప్రతికూల అంశాల నడుమ రిజర్వ్‌బ్యాంక్ ప్రభుత్వ బ్యాంక్‌ల సాయంతో డాలర్లను విక్రయించి, రూపాయికి మద్దతు ఇచ్చినప్పటికీ భారత్ కరెన్సీ నిలబడలేదని ఫారెక్స్ ట్రేడర్లు చెప్పారు. డాలర్ ఇండెక్స్ 10 నెలల గరిష్ఠస్థాయి 105.80 వద్ద ట్రేడవుతున్నది.

ఆర్థిక గణాంకాలతో నీరసిస్తున్న రూపాయి

ఇటీవల వెలువడిన దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు నిరుత్సాహంగా ఉండటం, ఎఫ్ పీఐల అమ్మకాలు రూపాయిపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు గత ఏడాదితో పోలిస్తే 37 శాతం నుంచి 39 శాతానికి పెరగడం, ఆర్థిక వ్యవస్థకు కీలకమైన మౌలిక రంగాల వృద్ధి రేటు సెప్టెంబర్ నెలలో 8 శాతానికి పరిమితం కావడం ఆందోళనకర అంశాలేనని వారంటున్నారు. పారిశ్రామిక రంగం వృద్ధి అక్టోబర్ నెలలో 5.8 శాతానికి తగ్గడమూ రూపాయిపై ప్రభావం చూపించింది.

జీడీపీ వృద్ధి 6.5 శాతం

2024, 2025 ఆర్థిక సంవత్సరాలకు మోర్గాన్ స్టాన్లీ అంచనాలు

న్యూఢిల్లీ, నవంబర్ 13: ప్రస్తుత 2023-24, వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో భారత్ జీడీపీ 6.5 శాతం చొప్పున వృద్ధిచెందుతుందని అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. పటిష్ఠమైన కార్పొరేట్, ఫైనాన్షియల్ రంగం బ్యాలెన్స్ షీట్స్ కారణంగా భారత ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావం పెద్దగా లేదంటూ మోర్గాన్ స్టాన్లీ రీసెర్చ్ విడుదల చేసిన '2024 ఇండియా ఎకనామిక్ అవుట్‌లుక్'లో వివరించింది. దేశీయ డిమాండ్ భారత వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదని పేర్కొంది. అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ జీడీపీ 6.7 శాతం పెరుగుతుందని అంచనా వేయగా, ఐఎంఎఫ్ 6.3 శాతం వృద్ధి అంచనాల్ని ప్రకటించింది. రిజర్వ్‌బ్యాంక్ అంచనా 6.5 శాతంగా ఉంది.

వచ్చే జూన్ తర్వాత ఆర్బీఐ రేటు తగ్గొచ్చు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం ఉండవచ్చని, అటుతర్వాత 2024-25లో 4.9 శాతానికి తగ్గవచ్చని ఇన్వెస్ట్‌మెంట్ అంచనాల్లో పేర్కొంది. అలాగే సర్వీసుల నికర ఎగుమతులు పెరుగుతాయని, దీంతో కరెంటు ఖాతా లోటు 1.5-1.7 శాతానికి పరిమితం కావచ్చని మోర్గాన్ స్టాన్లీ రీసెర్చ్ తెలిపింది. భారత్ బాండ్లను జేపీ మోర్గాన్ డెట్ ఇండెక్స్‌లో చేర్చడంతో మరిన్ని విదేశీ పెట్టుబడులు వస్తాయని, తద్వారా బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ పరిస్థితి మెరుగుపడుతుందని వివరించింది. 2024 ప్రథమార్థం వరకూ వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచవచ్చని, 2024 జూన్ నుంచి రేట్లను తగ్గించవచ్చని అంచనా వేసింది. అయితే చమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు బలహీనపడటం భారత్ ఆర్థిక స్థిరత్వానికి రిస్క్‌లని హెచ్చరించింది.

జోరుగా వంటనూనె దిగుమతులు

అక్టోబర్‌తో ముగిసిన ఏడాది కాలంలో భారీగా వృద్ధి

దేశంలోకి 167.1 లక్షల టన్నులుగా వెజిటబుల్ ఆయిల్ దిగుమతులు: ఎస్ఈఏ

న్యూఢిల్లీ, నవంబర్ 13: దేశంలోకి వంటనూనెల దిగుమతులు పెరిగాయి. ఈ అక్టోబర్‌తో ముగిసిన ఏడాది (2022-23) కాలంలో వెజిటబుల్ ఆయిల్ ఇంపోర్ట్స్ 16 శాతం వృద్ధి చెందినట్టు సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) సోమవారం వెల్లడించింది. 167.1 లక్షల టన్నులుగా ఉన్నట్టు పేర్కొన్నది. అంతకుముందు సంవత్సరం (2021-22 లేదా నవంబర్-అక్టోబర్) 144.1 లక్షల టన్నులుగా నమోదైనట్టు చెప్పింది.

నాన్-ఎడిబుల్స్ తక్కువే

గత నెల అక్టోబర్‌తో ముగిసిన ఏడాది కాలంలో దేశంలోకి 167.1 లక్షల టన్నుల వెజిటబుల్ ఆయిల్స్ దిగుమతయితే.. 164.7 లక్షల టన్నులు వంటనూనెలే. 2.4 లక్షల టన్నులు మాత్రమే నాన్-ఎడిబుల్ ఆయిల్స్ అని ఎస్ఈఏ ఈ సందర్భంగా తెలిపింది. అంతకుముందు సంవత్సరంతో చూస్తే ఈసారి 24.4 లక్షల టన్నుల వంటనూనెల దిగుమతి పెరిగినట్టు వివరించింది. ముడి పామాయిల్, సోయాబీన్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వాటానే ఎక్కువని పేర్కొంటున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద వెజిటబుల్ ఆయిల్ కొనుగోలుదారుగా భారత్ ఉన్నట్టు స్పష్టం చేసింది.

రూ.1.38 లక్షల కోట్లు

2022-23లో దేశంలోకి దిగుమతైన వంటనూనెల విలువ రూ.1.38 లక్షల కోట్లుగా ఉన్నది. అయితే అంతకుముందు సంవత్సరం 2021-22లో దిగుమతైన వంటనూనెలు తక్కువే అయినా విలువ రూ.1.57 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఎస్ఈఏ చెప్పింది. 2020-21లో రూ.1.17 లక్షల కోట్లుగా ఉన్నది. ఇక మొత్తం పామాయిల్ దిగుమతుల్లో 25 శాతానికిపైగా ఆర్బీడీ పామోలిన్ ఇంపోర్ట్సే ఉన్నాయి. గతంతో పోల్చితే ఈసారి 18.4 లక్షల టన్నుల నుంచి 21.1 లక్షల టన్నులకు పెరిగాయి.

దేశంలో ఉత్పత్తి పెరగాలి..

దేశంలో వంటనూనె పంటల ఉత్పత్తి పెరగాలని, అప్పుడే విదేశాల నుంచి భారత్‌కు దిగుమతులు తగ్గుతాయని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. ఈ దిశగా రైతులకు కేంద్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా వారు సూచిస్తున్నారు. తెలంగాణలో పామాయిల్ పంట సాగుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తున్న విషయం తెలిసిందే. ఆయా సంస్థలతోనూ కలిసి వెళ్తున్న సంగతీ విదితమే. ఈ రకంగానే కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో వంటనూనె పంటలకు ప్రాధాన్యత ఇస్తే.. విదేశీ మారకాన్నీ మిగుల్చుకున్నవారమవుతామని మోదీ సర్కారుకు హితవు పలుకుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జియో ఫైబర్ సేవలు

మరో 20 నగరాలకు విస్తరించిన సేవలు

హైదరాబాద్, నవంబర్ 13: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో.. రాష్ట్రవ్యాప్తంగా తన ఎయిర్‌ఫైబర్ సేవలను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 115 నగరాల్లో ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ..తెలంగాణలో ఒకేసారి 20 నగరాల్లో ప్రారంభించింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, ఢిల్లీ-ఎన్‌సీఆర్ లోనూ స్టార్ట్ చేసింది.

దేశవ్యాప్తంగా 115 నగరాల్లో..

దేశవ్యాప్తంగా మరో 115 నగరాల్లో జియో ఫైబర్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 12 నగరాల్లో, గుజరాత్ రాష్ట్రంలో 25 నగరాలు, కర్ణాటకలోని 21 నగరాలు, మహారాష్ట్రలోని 14 నగరాలు, తమిళనాడులోని 22 నగరాల్లో ఈ ఫైబర్ సేవలు ప్రారంభించినట్లు తెలిపింది.

తెలంగాణలో..

కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, హైదరాబాద్, అర్మూర్, జగిత్యాల్, మిర్యాలగూడ, నిర్మల్, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, రామగుండం, సంగారెడ్డి, పాల్వంచ, పెద్దపల్లి, సూర్యపేట్, తాండూర్, సిద్దిపేట, సిరిసిల్లా, వరంగల్‌లో అందుబాటులోకి వచ్చాయి. కాగా, ఆరు నెలలు, ఏడాది కాలపరిమితితో ఎయిర్‌ఫైబర్ 5జీ ప్లాన్లను జియో ఫైబర్ ప్రవేశపెట్టింది. రూ.599 మొదలుకొని రూ.3,999 గరిష్ఠ స్థాయిలో ప్లాన్లు ఉన్నాయి. ఇన్‌స్టాలేషన్ కోసం ముందుగా రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది.

రిటైల్ మార్కెట్‌లో పండుగ జోష్

రికార్డు స్థాయిలో అమ్మకాలు • రూ.3.75 లక్షల కోట్లుగా నమోదు

దేశీయ ఉత్పత్తులకు భలే గిరాకీ • వెల్లడించిన సీఏఐటీ

న్యూఢిల్లీ, నవంబర్ 13: దేశీయ రిటైల్ మార్కెట్‌కు పండుగ కళ వచ్చింది. ఈ పండుగ సీజన్‌లో ఇప్పటిదాకా రూ.3.75 లక్షల కోట్ల రిటైల్ అమ్మకాలు జరిగినట్టు ట్రేడర్స్ సంఘం అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) సోమవారం తెలిపింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా జోరుగా విక్రయాలు సాగినట్టు సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ వెల్లడించారు. ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేకుండా అన్ని రంగాల్లో ఆకర్షణీయమైన సేల్స్ నమోదయ్యాయి. వినాయక చవితితో మార్కెట్‌లో పండుగ సందడి మొదలవుతుందన్న విషయం తెలిసిందే. విజయదశమి, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి వరకు కొనసాగుతుందన్న సంగతీ విదితమే. ఉత్తరాదిలో మరికొన్ని పర్వదినాలూ ఉంటాయి.

చైనా మార్కెట్‌కు దెబ్బ

ఈ ఏడాది పండుగ సీజన్‌లో దేశీయంగా తయారైన వస్తూత్పత్తులకే బాగా గిరాకీ ఉందని ఈ సందర్భంగా ప్రవీణ్ ఖండేల్వాల్ చెప్పారు. ముఖ్యంగా ఈ దీపావళికి చైనా ఉత్పత్తుల సేల్స్ లక్ష కోట్ల రూపాయలకు పైగా తగ్గిపోయాయన్నారు. పటాకులతోపాటు డెకరేషన్ ఐటెమ్స్ అన్నీ ఎక్కువగా స్థానికంగా తయారైన వాటికే ఆదరణ ఉన్నట్టు వెల్లడించారు. మునుపు దీపావళి అమ్మకాల్లో దాదాపు 70 శాతం చైనా ఉత్పత్తుల వాటానే ఉండేదని ఆయన గుర్తుచేశారు. అయితే ఇప్పుడు భారతీయ వస్తూత్పత్తులకు మన మార్కెట్‌లో అమ్మకాలు పెరుగుతున్నాయని వివరించారు.

ఇది శుభపరిణామంగా పేర్కొన్నారు. ఈ దీపావళికి దేశీయ ప్రోడక్ట్స్‌కే డిమాండ్ ఎక్కువగా కనిపించినట్టు వెల్లడించారు.

ఆటో నుంచి గోల్డ్‌దాకా..

ఈ పండుగ సీజన్‌లో వాహనాల దగ్గర్నుంచి బంగారందాకా.. దుస్తుల నుంచి గృహోపకరణాల వరకు అన్ని విభాగాల్లోనూ అమ్మకాలు బాగా జరిగినట్టు వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యంగా ధంతేరస్ సందర్భంగా వాహన విక్రయాలూ భారీగానే నమోదయ్యాయి. రెండంకెల వృద్ధి ఉందని ఆటో కంపెనీలు తెలిపాయి. బంగారం అమ్మకాలు సైతం 15-20 శాతం పెరిగినట్టు నగల వర్తకులు పేర్కొంటున్నారు. టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ అవెన్లు, మిక్సర్ గ్రైండర్లు ఇలా అనేకానేక గృహోపకరణాల సేల్స్ కూడా పెరిగినట్టు చెప్తున్నారు. అయితే ఈ-కామర్స్ కంపెనీలతో పోటీగా బహిరంగ మార్కెట్‌లో వ్యాపార సంస్థలు డిస్కౌంట్లు, బహుమతుల్ని పెట్టడం కలిసొచ్చిందని ట్రేడింగ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఆన్‌లైన్.. ఆఫ్‌లైన్‌లో

ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ ఈ పండుగ సీజన్‌కు అమ్మకాలు పెద్ద ఎత్తున నమోదయ్యాయి. ఓవైపు ఆన్‌లైన్ సైట్స్‌లో కొనుగోళ్లు జరుపుతూనే.. మరోవైపు సంప్రదాయ మార్కెట్‌లోనూ కష్టమర్లు సందడి చేయడం గమనార్హం. దీంతో మార్కెట్ మొత్తం పండుగ వాతావరణం నెలకొన్నది. కాగా, గోవర్ధన్ పూజ, భైయా దూజ్, చాత్ పూజ, తులసీ వివాహ్ వంటి శుభకార్యాలు ఇంకా జరుగాల్సి ఉన్నందున అమ్మకాలు పెరుగుతాయన్నారు. ఈ క్రమంలోనే ఉత్తరాది రాష్ట్రాల్లో మరో రూ.50వేల కోట్ల వ్యాపారాని వీలుందని అంచనా వేశారు.

తగ్గిన ధరల సూచీ

న్యూఢిల్లీ, నవంబర్ 13: గత కొన్ని నెలలుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన ధరల సూచీ క్రమంగా శాంతిస్తున్నది. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టడంతో గత నెలకుగాను రిటైల్ ధరల సూచీ నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 4.87 శాతానికి పడిపోయింది. అయినప్పటికీ రిజర్వు బ్యాంక్ అంచనావేసిన 4 శాతం కంటే అధికంగా నమోదైంది. సెప్టెంబర్ నెలలో 5.02 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉంటుందని గత సమీక్షలో రిజర్వు బ్యాంక్ అంచనావేసిన విషయం తెలిసిందే. ఆహార పదార్థాల ధరలు తగ్గడంతో గత నెలలో ధరల సూచీ తగ్గుముఖం పట్టిందని ఇక్రా ఆర్థికవేత్త అదితి నాయర్ తెలిపారు.

గ్రాసిం లాభం 1,164 కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 13: ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన ఫ్లాగ్‌షిప్ సంస్థ గ్రాసిం ఇండస్ట్రీస్ ఆశాజనక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగా సంస్థ నికర లాభం 13 శాతం ఎగబాకి రూ.1,163.75 కోట్లకు చేరుకున్నది. ఏడాది క్రితం ఇది రూ.1,009 కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.27,485 కోట్ల నుంచి రూ.30,220 కోట్లకు చేరింది.

అమ్మకానికి మరో పీఎస్‌యూ వాటా

ఐఆర్ఈడీఏలో వాటా విక్రయిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఎల్ఐసీ తర్వాత ఐపీవోకు వస్తున్న ప్రభుత్వ సంస్థ ఇదే

ఈ నెల 21న ప్రారంభం కానున్న పబ్లిక్ ఆఫర్

న్యూఢిల్లీ, నవంబర్ 13: కంపెనీల్లో వాటాల్ని విక్రయించి ద్రవ్యలోటును పూడ్చుకోవాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం మరో పీఎస్‌యూను ఐపీవోకు సిద్ధం చేసింది. ఇండియన్ రెన్యువల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ఈడీఏ)లో తొలి పబ్లిక్ ఆఫర్ నవంబర్ 21న ప్రారంభం కానుంది. నవంబర్ 23న ఆఫర్ ముగుస్తుంది. గత ఏడాది మే నెలలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఐపీవో తర్వాత పబ్లిక్‌కు వాటాల్ని ఆఫర్ చేస్తున్న ప్రభుత్వ సంస్థ ఇదేకావడం గమనార్హం. ఈ ఆఫర్‌లో కేంద్ర ప్రభుత్వం 26.8 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. వీటితో పాటుగా రూ.10 ముఖ విలువ కలిగిన 40.3 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను కంపెనీ ఆఫర్ చేస్తుంది. అంటే మొత్తం 67.1 కోట్ల షేర్లు ఈ ఐపీవో ద్వారా పబ్లిక్‌కు జారీచేయనున్నారు. ఆఫర్ ప్రైస్‌బ్యాండ్‌ను త్వరలో ప్రకటిస్తారు. ఆఫర్‌లో 50 శాతం అర్హులైన సంస్థాగత ఇన్వెస్టర్లకు, 15 శాతం సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు విక్రయిస్తారు. 35 శాతం షేర్లను రిటైల్ ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేశారు.

రూ.47 వేల కోట్ల రుణ పోర్ట్‌ఫోలియో

కేంద్రం విక్రయించే షేర్ల ద్వారా లభించే సొమ్ము ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా సమీకరించే మొత్తాన్ని కంపెనీ తన భవిష్యత్ మూలధన అవసరాలకు, రుణ వితరణకు వాడుకుంటుంది. 36 ఏండ్లుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐఆర్ఈడీఏ వివిధ రెన్యువల్ ఎనర్జీ ప్రాజెక్టులకు వివిధ దశల్లో రుణ సదుపాయాల్ని అందిస్తుంది. 2023 జూన్ నాటికి ఐఆర్ఈడీఏ వద్ద రూ.47,206 కోట్ల రుణ పోర్ట్‌ఫోలియో ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో కంపెనీ ఆదాయం 47 శాతం వృద్ధితో రూ.2,320 కోట్లకు చేరగా, లాభం 41 శాతం వృద్ధితో రూ.579 కోట్లకు పెరిగింది. ఐపీవో తర్వాత ఐఆర్ఈడీఏ షేరు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టవుతుంది.

తెలంగాణలోని ఏబీడీ ప్లాంట్ కెపాసిటీ పెంపు

ముంబై, నవంబర్ 13: తెలంగాణలోని రంగాపూర్ వద్ద ఉన్న ఆల్కాహాల్ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచుకున్నట్టు అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిల్లర్స్ లిమిటెడ్(ఏబీడీ) ప్రకటించింది. ప్రస్తుతం ఈ యూనిట్‌లో ఏడాదికి 54.75 మిలియన్ లీటర్ల ఆల్కాహాల్ ఉత్పత్తి అవుతుండగా, దీనిని 65 మిలియన్ లీటర్లకు పెంచింది. కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే ఈ వ్యాపారాన్ని విస్తరించినట్లు తెలిపింది. రంగాపూర్‌లో 75 ఎకరాల స్థలంలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌తో 400 మందికి ఉపాధి లభిస్తుండగా, పరోక్షంగా లక్ష మంది రైతులకు లబ్ధిచేకూరుతున్నదని ఏబీడీ ఎండీ అలోక్ గుప్తా తెలిపారు.

ఆరు నెలల్లో 100 షోరూంలు

హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా

న్యూఢిల్లీ, నవంబర్ 13: దేశంలో అతిపెద్ద ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. దేశీయంగా ప్రీమియం వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఆరు నెలల్లో ప్రత్యేకంగా 100 ప్రీమియం రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేయబోతున్నట్టు కంపెనీ సీఈవో నిరంజన్ గుప్తా ప్రకటించారు. దేశ ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటంతో వాహన కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయని, దీంతో లగ్జరీ బైకులకు కూడా డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నదని వాటాదారులతో జరిగిన సమావేశంలో ఆయన చెప్పారు. అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ దేశీయ ఆర్థిక రంగం దూసుకుపోతున్నదని, ప్రపంచ దేశాల్లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నది కూడా మన దేశమేనని ఆయన పేర్కొన్నారు.

వర్షాభావ పరిస్థితులు కొంతే

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు వాహన విక్రయాలపై కొంతమేర ప్రభావం చూపనున్నాయని, అయినప్పటికీ రబీ పంట ఆశించిన స్థాయి కంటే అధికంగా ఉండటం ఇందుకు కారణమన్నారు. దీంతో ఈ ఏడాది పండుగ సీజన్‌లో వాహన అమ్మకాలు పెరిగాయని చెప్పారు. గత నెలలో 18,95,799 యూనిట్ల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. ఏడాది క్రితం ఇదే నెలలో అమ్ముడైన 15,78,383 యూనిట్లతో పోలిస్తే 20 శాతం పెరిగాయని సియామ్ నివేదిక వెల్లడించింది.

తొలి ప్రీమియం స్టోర్ ప్రీమియా..

కేవలం ప్రీమియం బైకులను విక్రయించడానికి ప్రీమియా పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేసింది. ఇటీవల తన తొలి అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. వచ్చే ఆరు నెలల్లో మరో 100కి పైగా ఈ స్టోర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్టు, ఇప్పటికే 200కి పైగా స్టోర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈవీల వ్యాపారంపై ఆయన స్పందిస్తూ..ఇది కొనసాగుతున్నదని, ఇప్పటికే 100 నగరాల్లో ఈవీ స్కూటర్లను విక్రయిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: